క్లుప్తంగా

మొరం తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

దామెర : మండల కేంద్రంలో అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పెద్దగుట్ట ప్రాంతంలో కొంతకాలంగా కొంతమంది అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచారంతో ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. రెండు ట్రాక్టర్లు మొరం లోడ్‌తో కనిపించగా జేసీబీ, మరో మూడు ట్రాక్టర్లు అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. కాగా పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


విద్యాసాగర్ (ఫైల్)

శాయంపేట : మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన మండల విద్యాసాగర్ (30) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరంపేట గ్రామానికి చెందిన మండల విద్యాసాగర్ వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. విద్యాసాగర్‌కు ఏడాదిన్నర క్రితం ఎల్కతుర్తి హవేలీకి చెందిన అమ్మాయితో వివాహం జరిగింది. భార్యకు జ్వరం రాడంతో గత నాలుగు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. విద్యాసాగర్ గట్లకానిపర్తిలో బంధువుల సంవత్సరీకానికి వెళ్లివచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిగారింటికి వెళ్లిన భార్య తిరిగి వచ్చి తలుపు కొట్టినా తీయకపోవడంతో స్థానికులు సహాయంతో తలుపులు తెరిపించింది. దీంతో విద్యాసాగర్ ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. కాగా అతడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని విద్యాసాగర్ మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామంలో పేకాడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వసంతాపూర్ గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాడుతున్నారనే సమాచారం వచ్చిందన్నారు. దీంతో దాడులు నిర్వహించి పేకాడుతున్న చల్లా గణపతిరెడ్డి, ముప్పారపు శ్రీనివాస్, మహ్మద్ ఇస్మాయిల్, చల్లా రాజిరెడ్డి, ఎస్‌కే.ఆరీఫ్, చల్లా ప్రకాశ్‌రెడ్డి, గట్ల శ్రీధర్‌రెడ్డి, అబ్బోజు కోటిలింగాచారి, తాటికొవడ బాబు, ముప్పారపు ధనుజయ్‌ను అరెస్ట్ చేసి రూ. 22వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, 7 బైకులు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బీవీపీని బలోపేతం చేయాలి

విద్యారణ్యపురి: సామాజికసేవ కార్యక్రమాలతో ముందుకెళ్తున్న భారత వికాస్ పరిషత్‌ను మరింతగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డి సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం హనుమకొండలోని డెఫడైల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బీవీపీ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ఏడాదిలో వివిధ సామాజిక సేవాకార్యక్రమాలు గణనీయంగా నిర్వహించారన్నారు. బీవీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె సత్యనారాయణ మాట్లాడుతూ బీవీపీ పది మంది రైతులకు ఒక్కో పవర్‌స్ప్రేయర్ చొప్పున 100 మంది రైతులు కలిపి 10 పవర్‌స్ప్రేయర్లను పంపిణీ చేశామన్నారు. అలాగే పలువురి దివ్యాంగులకు కృత్రిమ అవయాలను ఉచితంగా అందజేసినట్లు నివేదికను సమర్పించారు. సమావేశంలో సహృదయ సంస్థ బాధ్యులు గిరిజా మనోహర్, బీవీపీ కోశాధికారి వెంకటరెడ్డి, బాధ్యులు అగర్వాల్, జయపాల్‌రెడ్డి, రామారావు, వివేకానంద్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు : ఎరుకల కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆ సంఘం మండల కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అంతకు ముందు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆదివాసీ ఎరుకలు విద్య, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా ఎరుకల జీవితాలు మారడం ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ వర్గీకరణ కూడా చేపట్టాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోకిని సమ్మయ్య, ప్రధానకార్యదర్శి మానుపాటి రమేశ్, మండల అధ్యక్షుడు దుగ్యాల రమేశ్, సాంబరాజు, శ్రీను, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేతిరి రాజశేఖర్, ఓని సదానందం, నాయకులు ఎల్లస్వామి, బాబు, ప్రశాంత్, రామ్, రాజు, సురేశ్, విజయ్, సుజాత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు


వేలేరు నుంచి కమ్మరిపేట గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు


మల్లికుదుర్ల నుంచి కుమ్మరిగూడేనికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా కల్వర్టు

- శిథిలావస్థకు చేరిన వైనం
- రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారుల భయాందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. పలు చోట్ల రక్షణ గోడలు (రెయిలింగ్) లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఆయా గ్రామాల్లో కొన్ని లోలెవల్ కల్వర్టులు కూడా ఉండటంతో వర్షాకాలంలో పై నుంచి వరద ఉధృతంగా పారడంతో రాకపోకలకు అంతరాయం కలుగనుందని, ప్రతీ ఏడాది కష్టాలు తప్పడం లేదని మండల వాసులు వాపోతున్నారు. కల్వర్టులకు రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచిన ప్రమాదం జరిగే అవకాశం ఉందని, రాత్రివేళల్లో కల్వర్టులపై నుంచి ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నామంటున్నారు. మండల కేంద్రం నుంచి కమ్మరిపేటకు వెళ్లే దారిలో ఉన్న వాగుపై కల్వర్టుకు రెయిలింగ్ లేకపోవడం, పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, మల్లికుదుర్ల నుంచి కుమ్మరిగూడెం వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిందని, ప్రస్తుతం కల్వర్టు పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరుకుందని పాలకులు సైతం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఆదారి గుండా నిత్యం పాఠశాలకు వెళ్లే విద్యార్థుల బస్సులు, వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, సింగిల్ రోడ్డు కావడం, కల్వర్టుకు రక్షణ గోడలు లేకపోవడంతో వాగులో పడే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. అలాగే పీచర నుంచి మల్కాపూరు వెళ్లే దారిలో మంచినీళ్ల వాగు వద్ద లోలెవల్ కల్వర్టుకు రక్షణగోడలు లేక ప్రమాదకరంగా ఉందని, గతంలో మంచినీళ్ల వాగులో పలు వాహనాలు అదుపుతప్పి కల్వర్టులో పడిన ఘటనలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరుకున్న కల్వర్టులను తొలగించి నూతనంగా నిర్మించాలని, రెయిలింగ్ లేని కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

కొత్త కల్వర్టు నిర్మించాలి



మండల కేంద్రం నుంచి కమ్మరిపేటకు వెళ్లే దారిలో కొన్ని సంవత్సరాల క్రితం కల్వర్టు నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. రాత్రిపూట ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కొత్త కల్వర్టును నిర్మించాలి.

- కిరణ్, కమ్మరిపేట గ్రామస్తుడు

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు


సుదర్శన నారసింహ హవన పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో గల నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణం జరిపించారు. నిత్యపూజల అనంతరం శ్రీలక్ష్మీనరసింహస్వామి స్తంభమూర్తి, గర్భాలయంలోని ధ్రువ మూర్తులు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. తర్వాత అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ-నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. అర్చన, నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పణ, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్, విక్రమ్, భక్తులు పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన అడ్వొకేట్ తోట పరమేశ్వర్ తండ్రి తోట లింగమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ వంగాల రమాదేవినారాయణరెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సామల ధనుంజయ్ ఉన్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శాయంపేట మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర, పరకాల పట్టణంలో ఎమ్మెల్యే రేవూరి పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పరకాల పట్టణంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎల్కతుర్తిలో మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పాల్గొని అంబేడ్కర్ విగ్రహం, చిత్రపటానికి నివాళులర్పించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు అంబేడ్కర్ సంఘం, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.

- సాక్షి, నెట్‌వర్క్


పరకాల : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


శాయంపేట : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు


కమలాపూర్ : అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఝాన్సీరాణి, తదితరులు


ఎల్కతుర్తి : అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్


ఆత్మకూరులో..


ఐనవోలులో..


కమలాపూర్ : రక్తదానం చేస్తున్న యువకులు


నడికూడలో..


పరకాల : పూలమాల వేస్తున్న న్యాయవాదులు


వేలేరు : నివాళులర్పిస్తున్న విజయరామరావు


ధర్మసాగర్ : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..


దామెరలో..

'బీజేపీ ఎత్తుగడలను అడ్డుకోవాలి'

ఎల్కతుర్తి : భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర పన్నుతుందని, ఆ పార్టీ అవలంభిస్తున్న ఎత్తుగడలను కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అడ్డుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర, ర్యాలీ కొనసాగించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రపన్నుతుందన్నారు. బీజేపీ పన్నుతున్న కుట్రను తిప్పికొట్టేందుకు పాదయాత్రలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై కూడా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇంద్రసేనారెడ్డి, అశోక్‌రెడ్డి, సంతాజీ, రాజేశ్వర్‌రావు, రమేశ్, వెంకటేశ్, బక్కి, నవీన్, శ్రీనివాస్, అనిల్, సుమన్ పాల్గొన్నారు.

వేలేరు : భారత రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, కోఆర్డీనేటర్ కట్టా మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, రాజిరెడ్డి, రాంగోపాల్ రెడ్డి, యాదగిరి, సద్దాం హుస్సేన్, లక్ష్మణ్ నాయక్, సంపత్, రణధీర్‌రెడ్డి, రాజేందర్, శ్రీకాంత్, సలీంమాలీక్ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు గుర్రపు ప్రసాద్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం గాంధీని, అంబేడ్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని అవమానపరిచే విధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. నాయకులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


ఆత్మకూరు : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు / నడికూడ / దామెర : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో సరస్వతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, నడికూడ మండల కేంద్రంలో డీఆర్‌డీఏ, ఎస్ఈఆర్‌పీ పౌర సరఫరాల శాఖ, శ్రీ వెంకటేశ్వర గ్రామ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, దామెర మండలంలోని సింగరాజుపల్లిలో సిరి గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వరివేస్తే ఉరి వేసుకున్నట్లే అందని, కానీ రేవంత్ సర్కారు రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో బోనస్ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఆత్మకూరులో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమలాపురం రమేశ్, ఏఎంసీ చైర్ పర్సన్ బీరం సునంద, పూజారి స్రవంతి, సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, కాంగ్రెస్ నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, బోరిగం స్వామి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు బాబుమియా, కృష్ణంరాజు, సొసైటీ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి పాల్గొనగా నడికూడ, దామెరలో పరకాల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఏఓ పారిక జైసింగ్, ఏపీఎం రమాదేవి, ఏఈఓలు, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ కల్పన, ఏపీఎం ఝాన్సీ, ఏఓ రాకేశ్, ఏఎంసీ చైర్మన్ సునందసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కాంలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్‌ఎస్ పార్టీ

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రణవ్


యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ప్రణవ్

కమలాపూర్: స్కాంలకు కేరాఫ్ అడ్రస్ బీఆర్‌ఎస్ పార్టీ అని, ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక స్కాంలు చేశారని, నిరాధార ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో హైలైట్ కావడానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ ఆరోపించారు. సోమవారం ఆయన కమలాపూర్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పేపర్ లీకులతో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతూ హుజూరాబాద్ పరువు తీస్తున్నాడని ఆయన మండిపడ్డారు.

మహా పాదయాత్ర..

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా మండలంలోని శనిగరం నుంచి కమలాపూర్ అంబేడ్కర్ విగ్రహం వరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం చేపట్టిన మహా పాదయాత్రను ప్రణవ్ ప్రారంభించి వారితో కలిసి నడిచారు. అనంతరం కమలాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరవీందర్, వైస్ చైర్మన్ ఐలయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూడ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు చేరాల రోహిత్, నాయకులు బాలసాని రమేష్‌గౌడ్, చరణ్‌పటేల్, రాజిరెడ్డి, భిక్షపతి, ఆడెపు శ్రీకాంత్, ఏఎంసీ డైరెక్టర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం ఐక్య చైతన్య వేదిక నాయకులు

పరకాల : రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లు సవరణ చేపట్టిందని, తక్షణమే రద్దు చేయాలని ముస్లిం ఐక్య చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎండీ.ఖాదర్ మొయినోద్దీన్ డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆ ఐక్య చైతన్య వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కుల, మతాలకు అతీతంగా పాలిస్తున్నామని ప్రచారం చేస్తూనే ముస్లింలపై కేంద్ర ప్రభుత్వం విషం చిమ్ముతోందని ఆరోపించారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం


సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : నేరాలను కట్టడి చేసేందుకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. భవిష్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సహకారంతో మండలంలోని గుండేడులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం భవిష్య సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగపురి రాజుగౌడ్ మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన గుండేడులో పోలీసుల సూచన మేరకు నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పర్యవేక్షణ కోసం రూ.32 వేల విలువచేసే 3 సీసీ కెమెరాలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు లాండిగె లక్ష్మణ్‌రావు, వలిగె సాంబరావు, ఉపాసి తిరపతిరావు, మేకల రవి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

శాయంపేట : గట్లకానిపర్తి గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరవేసుకుంటూ సందడి చేశారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులకు శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, సాంబరెడ్డి, సాయన్న, ధర్మరావు, షేక్ హాజి నూరాని, సురేందర్, ప్రతాప్, కుమారస్వామి, అశోక్, సమన్వయకులు రాజేందర్, రాజ్‌కుమార్, భరత్, సంతోశ్, సురేందర్, సంపత్, నాగరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

హసన్‌పర్తి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి లీగల్ కౌన్సిల్ శ్రీదేవి అన్నారు. మండలంలోని సీతానాగారంలో సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి సెంటర్ ప్రతినిధి అనూష, వీఓఏ విజయ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.